ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
బుధవారం | సెప్టెంబరు 09, 2026 | సంపుటి : 7 | సంచిక : 85 | పేజీలు : 2



## సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

- వర్ధన్నపేటలో బీఆర్ఎస్ నిరసన

2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు

### సెషన్ మొత్తానికి ఎమ్మెల్సీలపై వేటు

- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం
- మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన చైర్మన్


2లో

**హైదరాబాద్, ఆయుధం:**
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.
అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానించింది.









## స్పీకర్ పీఠంపై కడియం..

- ప్యానల్ స్పీకర్ హోదాలో సభ నిర్వహణ

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్యానల్ స్పీకర్ హోదాలో సభాధ్యక్ష స్థానంలో ఆసీనులై సభను నడిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభ సమర్థవంతంగా సాగేందుకు ప్యానల్ స్పీకర్ గా స్పీకర్ స్థానంలో అనుభవజ్ఞుడైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూర్చున్నారు. అనంతరం సభలో వివిధ ప్రజాసమస్యలపై జరిగిన చర్చలను ఆయనకు ఉన్న అనుభవంతో చాకచక్యంగా నిర్వహించారు. సభా నియమావళికి కట్టుబడి, ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యులకు తగిన సమయాన్ని ఇస్తూ సభను ఎంతో గౌరవప్రదంగా నడిపించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహా బిఆర్ఎస్ నాయకులు తాత మధు, నవీన్ లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బిఆర్ఎస్ నాయకుల ప్రవర్తనకు బాధ్యత తీసుకొని కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా అమోదించారు. మాజీ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా ఎన్నో ఏళ్ల సుదీర్ఘ రాజకీయ పరిజ్ఞానం కలిగిన కడియం శ్రీహరి సభాధ్యక్ష హోదాలో చూపిన సామర్థ్యం, క్రమశిక్షణ ఆయన పార్లమెంటరీ అనుభవానికి అద్దం పట్టాయి. స్పీకర్ స్థానంలో ఆయన సభను నిర్వహించిన తీరును సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదు

- వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్
- హసన్పర్తిలో బీజేపీ 'మహాధర్నా' – ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని డిమాండ్
- అధికారులకు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నిసార్లు చెప్పినా చలనమేది...?



**హనుమకొండ, ఆయుధం:** విద్యార్థులు, ఉద్యోగులు, నిత్యం ప్రయాణించే ప్రజల సౌకర్యార్థం హసన్పర్తి బస్టాండ్ లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకులు గురుమూర్తి శివకుమార్, హసన్పర్తి మండల అధ్యక్షులు మారం తిరుపతి ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై మాట్లాడుతూ... హసన్పర్తి మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడ ఆగకపోవడం వల్ల వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ప్రతి రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు ఆర్టీసీ డిపో మేనేజర్, రీజినల్ మేనేజర్ లకు వినతిపత్రాలు సమర్పించామని గుర్తుచేశారు.
అంతేకాకుండా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కూడా పలుమార్లు సమస్యను వివరించి విజ్ఞప్తులు చేసినప్పటికీ, అధికారుల్లో గానీ, ప్రభుత్వంలో గానీ ఎలాంటి చలనం లేకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవలం కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ, ప్రజల కనీస అవసరాలు, సమస్యల మీద లేదని విమర్శించారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తక్షణమే హసన్పర్తి జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా చర్యలు తీసుకోకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చాడ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, జనగాం జిల్లా కిసాన్ మోర్చా ఇన్చార్జి ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర కౌన్సెల్ మెంబర్ రాంచందర్ రెడ్డి, పెంబర్తి సర్పంచ్ కుమారస్వామి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మండల బిజెపి నాయకులు సారంగపాణి, పిట్టల కుమారస్వామి, చకీలం రాజేశ్వరరావు, పబ్బా ఉమాదేవి, పెద్దమ్మ శ్రీనివాసు, ప్రభాకర్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్-2026 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్-2026 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లు, అభ్యర్థుల హాజరు, కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న పరీక్షలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద కేంద్ర స్థాయి పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. కాగా హనుమకొండ జిల్లా వ్యాప్తంగా రెండు షిఫ్టులలో కలిపి మొత్తం 2137 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1961 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 176 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం పర్యవేక్షణలో అన్ని కేంద్రాలలో ఈరోజు పరీక్ష ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంతరాలు లేకుండా సజావుగా కొనసాగినట్లు అలాగే బుధవారం కుడా ఈ పరీక్ష నిర్వహణ ఉంటుందని విద్యా శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం డాక్టర్ బి. మన్మోహన్, బి. మహేష్, తదితరులు ఉన్నారు.

## వి.ఆర్. విద్యార్థికి తెలంగాణ ప్రభుత్వ కాళోజీ పురస్కారం

- నేడు రవీంద్రభారతిలో కాళోజీ జయంతి వేడుకలు

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రతి యేటా ప్రతిష్టాత్మకంగా ఇచ్చే కాళోజీ పురస్కారాన్ని 2026వ సంవత్సరానికి వి.ఆర్. విద్యార్థికి ప్రకటించింది. సెప్టెంబర్ 9వ తేదీన సాయంత్రం 5 గంటలకు కాళోజీ జయంతి ఉత్సవాన్ని రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు సమాచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు. ఈ ఉత్సవంలో కాళోజీ పురస్కారాన్ని కవి విమర్శకులు వి.ఆర్.విద్యార్థికి ప్రదానం చేస్తారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు.

## దళిత, ఆదివాసీల హక్కుల కోసం సమష్టి పోరాటం

- బీజేపీ సర్కారుది సవతి తల్లి వైఖరి..
- దళితులు, ఆదివాసీల హక్కుల కోసం పార్లమెంట్‌లోనూ, బయటా పోరాడుతాం
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**వరంగల్, ఆయుధం:** దళితులు, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం కోసం పార్లమెంట్ లోనూ, వెలుపలా సమష్టిగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంపీలు నిర్ణయించినట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. దళితులు, ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నా.. వారి సంక్షేమానికి కేటాయించే నిధులను తగ్గించడం ఆందోళనకరమన్నారు. ఎస్సీ, ఎస్టీల పట్ల ఎన్డీఏ ప్రభుత్వం సవతి తల్లి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ సమస్యలను పార్లమెంట్ లో బలంగా లేవనెత్తడంతో పాటు.. అవసరమైతే ప్రజల మధ్యకు వెళ్లి పోరాటం చేస్తామని ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.



### హల్ద్వానీ ఘటనపై ఆగ్రహం

మల్లికార్జున ఖర్గే పర్యటన అనంతరం హల్ద్వానీలో చోటుచేసుకున్నట్లు వెల్లడైన 'శుద్ధీకరణ' ఘటనను సమావేశం తీవ్రంగా ఖండించింది. ఇది దళితుల ఆత్మగౌరవానికే కాకుండా సమానత్వం, గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. ఘటనకు బాధ్యులపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆర్ఎస్ఎస్, ఇతర మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సంయుక్త వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీల గౌరవం, హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎంపీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు.



## మహిళలు, పిల్లల రక్షణ, పునరావాసానికి ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** జిల్లాలో మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలను సమర్థవంతంగా అరికట్టడం, బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించడం, వారి పూర్తి పునరావాసానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల దాడులకు గురై బాధితులైన మొత్తం 95 మంది మహిళలు చిన్నారులకు పరిహారం అందించాలని కమిటీ నిర్ణయించి ఆమోదించింది. బాధితులకు అండగా నిలిచి, వారికి మానసిక ధైర్యాన్ని కల్పించడంతో పాటు, చట్టపరమైన సహాయం, వైద్య సహాయం, విద్య, ఉపాధి వంటి పునరావాస చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాధితుల కేసులను ఏ మాత్రం జాప్యం లేకుండా పరిష్కరించాలని, ప్రతి బాధితురాలికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. షీటీమ్స్, భరోసా కేంద్రం, చైల్డ్ లైన్ ద్వారా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ గది, సిబ్బంది గది, నర్సుల గది, ఇంజక్షన్ రూమ్, ల్యాబొరేటరీ, ఫార్మసీ, టాయిలెట్స్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను కలిసి వారు ఏ సమస్యతో వైద్య సేవల కోసం వచ్చారో కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది స్పందన, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండేలా షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించాలని, ప్రతి షిఫ్ట్‌లో అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండేలా పర్యవేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు. హాస్పిటల్ నిర్వహణ పక్కాగా ఉండాలని... రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం

- శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన అనంతరమే నిర్ణయం
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతోపాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాల పై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యల పై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం జి.దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి.సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి.గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎం.ఎస్., వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె.శ్రీధర్‌రావు, ఆచార్య ఎం.పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి రజని, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, ఎంపిడిఓ రాజు, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.




## 23వ రోజు పాలిటెక్నిక్ విద్య పరిరక్షణ ఉద్యమం


**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థకు సంబంధించిన జీవో 97 నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్‌లో కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు 23వ రోజుకు చేరుకున్నాయి. పాలిటెక్నిక్ విద్య ప్రత్యేకత, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్తు, బోధన, బోధనేతర సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఈ ఆందోళన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్‌లో విద్యార్థులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, పాలిటెక్నిక్ వర్గాల ప్రతినిధులు నిరసనలో పాల్గొని తమ ఆందోళనను వ్యక్తం చేశారు. జీవో 97తో రాష్ట్రంలోని ప్రస్తుత పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ, దాని *అకడమిక్ నిర్మాణం, పరిపాలన, సిబ్బంది సేవా అంశాలు, విద్యార్థుల విద్యా మరియు ఉపాధి అవకాశాలు, అలాగే డిప్లొమా సాంకేతిక విద్య భవిష్యత్తుపై* ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, అన్ని వర్గాలతో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని పాలిటెక్నిక్ వర్గాలు కోరుతున్నాయి. పాలిటెక్నిక్ విద్యకు ఉన్న ప్రత్యేక గుర్తింపు, లక్ష్యాలు, విద్యా ప్రమాణాలను కాపాడుతూ, విద్యార్థులు, బోధనా సిబ్బంది, బోధనేతర ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

ఈ అంశంపై ప్రజల్లో, అన్ని వర్గాల మధ్య అవగాహన కల్పించేందుకు ఈనెల 9న సాయంత్రం 4:30 గంటల నుంచి 7:00 గంటల వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం* నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ/ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కేంద్ర TPJAC ప్రతినిధులు, అలాగే ఇతర విద్యా రంగ నిపుణులు, సంబంధిత వర్గాలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన ఈ అంశాన్ని *వాస్తవాలు, ప్రజాస్వామ్య విలువలు మరియు నిర్మాణాత్మక చర్చ ఆధారంగా* ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పాలిటెక్నిక్ వర్గాలు కోరాయి. సమస్యపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేసి, విద్యార్థుల భవిష్యత్తు మరియు సాంకేతిక డిప్లొమా విద్య ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 23వ రోజు కూడా కొనసాగుతున్న ఈ నిరసన ద్వారా పాలిటెక్నిక్ విద్య పరిరక్షణకు తమ ఐక్యతను, నిబద్ధతను చాటుతున్నామని* నిర్వాహకులు తెలిపారు.

# మహిళా ఎమ్మెల్యేలను అవమానపరచడం సరైంది కాదు



**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను రేవంత్ సర్కార్ నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ శాసనసభలో అడగడానికి వెళ్తున్న శాసనసభ్యులను మహిళా శాసనసభ్యులను గాయపరిచి అవమాన పరచడం సరైన విధానం కాదని రాష్ట్ర సరోగకి బోర్డు మెంబర్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ హరి రమాదేవి అన్నారు. మంగళవారం 40వ డివిజన్లోని చెట్లోళ్ల గడ్డ వద్ద బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు పరచకుండా అడిగేవారి ని అడగకుండా నిర్బంధం విధిస్తూ పోలీసులు అరెస్టులు చేయిస్తున్నారని ఆమె అన్నారు. మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సాధ్యం కానీ హామీలు ప్రకటించి 6 గ్యారెంటీలు 420 హామీలు అమలు పరచకపోవడం వలన ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఎప్పుడు పోతుందోనని ఎదురు చూస్తున్నారని అన్నారు. హామీలు నెరవేర్చాలని అసెంబ్లీలో అడగడానికి వెళ్తున్న శాసనసభ్యులను పోలీసులచే అడ్డగింపజేసి వారిని గాయపరిచి మహిళా శాసన సభ్యులను అవమానపరచి వారు గొంతు నొక్కడానికి రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తున్నారని... ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుపరచకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మాజీ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం సుల్తానా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎవరైనా అడిగితే అట్టి వారిపై కేసులు అరెస్టులు చేయిస్తున్నారని నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం మట్టిలో కలిసిపోయిందని ఆమె అన్నారు. ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మసూద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్ మరుపల్ల భాగ్యలక్ష్మి, మర్రి శ్రీనివాస్, రాజన్ బాబు, మరుపల్ల గౌతం, అంకం దేవానంద్, గోనె మధు, గుల్ల పెల్లి కర్ణ, అస్మా, ఎలుగల మానస, ఈగ అరుణ, సునీత, ప్రియాంక, మంజుల, రవి, రాజ నర్సు, సదానందం, క్యాతం రాజేందర్ ఉన్నారు.



## శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే చల్లా దంపతులు

**తిరుమల, ఆయుధం:** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి కృపాకటాక్షాలతో పరకాల నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చల్లా ధర్మారెడ్డి తెలిపారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### ధర్మారెడ్డికి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆయుధం:** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం అందజేయడంతో పాటు ప్రత్యేక లేఖ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లేఖలో చల్లా ధర్మారెడ్డి పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని, పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని కేటీఆర్ అభినందించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కేటీఆర్ స్వయంగా పుష్పగుచ్ఛం అందించి, లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలియజేయడం పట్ల చల్లా ధర్మారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తనపై చూపిన ఆప్యాయత, అభిమానానికి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు.



## సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

- వర్ధన్నపేటలో బీఆర్ఎస్ నిరసన

**వర్ధన్నపేట, ఆయుధం:** అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి రేవంత్ రెడ్డి బాధ్యత వహిస్తూ, బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ గృహనిర్బంధంలో ఉండగా.. ఆయన ఆదేశానుసారం నిర్వహించిన నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనపై బిఆర్ఎస్ పోరుబాటలో భాగంగా చివరి రోజున 7రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమాలపై వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

# ఎస్ఐఆర్-2026 గడువు పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరణ
- రివైజ్డ్ షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆయుధం:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పు వంటి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు తప్పనిసరిగా విచారణకు హాజరై తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు.

### సవరించిన షెడ్యూల్

- **క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ:** 17 ఆగస్టు - 7 అక్టోబర్
- నోటీసుల దశ, విచారణలు, క్లెయిమ్స్ అభ్యంతరాల పరిష్కారం: 17 ఆగస్టు - 5 నవంబర్
- **తుది ఓటరు జాబితా ప్రచురణ:** 9 నవంబర్

జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

- ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు లోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.



## నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలి: కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఎన్ని రోజుల్లోగా పూర్తి చేయగలరనే విషయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ లైన్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఈ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఉపయోగిస్తున్న నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఈఈ బి.గాయత్రీ, గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, డీఈలు శ్రీనివాస్, జట్టి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమనవాణి, ఏఈలు అనిల్, నీరజ, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పద్మశాలి సేవ పురస్కార్ అవార్డు అందుకున్న శామంతుల




**వరంగల్, ఆయుధం:** పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్ పద్మశాలీ సేవ పురస్కార్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేతన్న టీవీ ఛానల్ మొదటి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా హనుమకొండలోని ఎస్ వి ఎస్ ఆడిటోరియం లో ఆదివారం సాయంత్రం నేతన్న టీవీ బిగ్గెస్ట్ అవార్డ్స్ 2026 ప్రదానోత్సవం జరిగింది. టీవీ అధినేత పులికంటి రాజేందర్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా పద్మశాలి తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ హాజరై అవార్డ్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమ సందర్భంగా పద్మశాలి అఫీషియన్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ కు ఉత్తమ పద్మశాలి సేవ పురస్కార్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలీలు అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి చేనేత ప్రతిభావంతులు, జర్నలిస్టులు, వృత్తి నైపుణ్యాలు, పద్మశాలి ప్రముఖులు, వైద్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు

- తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెండ్

**ప్రకటించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆయుధం:** శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్ సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.

### తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం :

అంతకుముందు సభాపతి గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ చేసిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రతిపాదించారు. స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోందని, సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోందని, మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోందని సభ తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని, శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసింది. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉండి కూడా అవమానం ఎదుర్కోవాల్సి రావటం బాధాకరమని దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఇద్దరు మండలి సభ్యులపైనా క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేస్తూ తీర్మానించారు.

### సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ :

మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్‌ను బీఆర్ఎస్ సభ్యులు ఖండించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను చట్ట విరుద్ధంగా సస్పెండ్ చేశారని శాసనమండలి ఆవరణలో బైఠాయించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్ అనంతరం ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. మీడియా పాయింట్‌లో తాతా మధు మాట్లాడుతుండగా మార్షల్స్ అడ్డుకున్నారు. సస్పెన్షన్ వేటు పడినందున ప్రాంగణంలో మాట్లాడవద్దని అధికారులు తెలిపారు. తాతా మధును అదుపులోకి తీసుకుని వ్యానులో తరలించారు.

# నాణ్యతతో కూడిన అభివృద్ధే లక్ష్యం

- పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను, బిల్లుల చెల్లింపుల నిమిత్తం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, ప్రకాశరెడ్డిపేట ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్‌లోని పోచమ్మ మైదాన్, 21వ డివిజన్ ఎల్బీనగర్, 36వ డివిజన్‌లోని చింతల్, 38వ డివిజన్‌లోని ఖిలా వరంగల్ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణ పనుల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు. పోచమ్మ మైదాన్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పనుల పూర్తికి ముందు అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్ బాబు, డీఈలు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మాడల్ సోలార్ గ్రామంలో సర్వీస్ ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా జరగాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ, ఆయుధం:** పీ.ఎం. సూర్య ఘర్ పథకం కింద మోడల్ సోలార్ గ్రామాలుగా ఎంపికైన ఆత్మకూర్, కేశవాపురం గ్రామాల్లో ప్రతి ఇంటికి సోలార్ పానల్స్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రెడ్కో, NPDCL అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రెడ్ కో, NPDCl అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మోడల్ సోలార్ గ్రామాల్లో వ్యవసాయ బావులకు కూడా ఈ పథకం కింద విద్యుత్ త్వరితగతిన అందించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక పక్కాగా పూర్తి చేసి... తొందరగా విద్యుత్ సర్వేసులను విడుదల చేయాలన్నారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద రైతుల భూముల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే పనుల పురోగతిపై కూడా చర్చించారు. ఈ సమావేశం లో ఎస్ఈ ఎన్పీడీసీఎల్ సామ్య నాయక్, రెడ్ కో జిల్లా మేనేజర్ రాజేందర్, డిఈ, ఏఈ లు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695